పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# లిక్విడ్ గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను ఒక మైనర్ బాలుడిని అరెస్ట్ చేసిన పాత గుంటూరు పోలీసులు...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. గుంటూరు జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పాత నేరస్తులపై నిఘా పెట్టి, ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ, అటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీ చేశారు. గౌరవ ఎస్పీ ఆదేశాల మేరకు ఈస్ట్ డి.ఎస్పి అబ్దుల్ అజీజ్ ని పర్యవేక్షణ లో పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ వెంకట ప్రసాద్ తన పరిధిలో గంజాయి, లిక్విడ్ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్న గంజాయి అమ్మే వారి పై నిఘా పెట్టి, వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతూ ఎవరైనా గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తుంటే, వారిపై ఆకస్మిక దాడులు నిర్వహించి అరెస్ట్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ రోజు (15.03.2026) పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వస్త్ర నగర్ లోని ఖాళీ స్థలం లో లిక్విడ్ గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి ఒక కిలో (1 లీటర్ ) లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కేసు వివరాలు, గుంటూరుకు చెందిన షేక్ మహబూబ్ భాషా ఏ భాషా ఏ అక్బరి ఏ 220 భాషా S/o హనీఫ్, వ. 34 సం.లు., కులము: ముస్లిం , నివాసము. 5వ లైను, మసీద్ దగ్గర, తారకరామ నగర్, పాత గుంటూరు, గుంటూరు టౌన్ అనే అతను గంజాయి త్రాగడానికి అలవాటు పడి, తమ చెడు వ్యసనాలను తీర్చుకోవడానికి మరియు సులువుగా ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయము తీసుకోని, లిక్విడ్ గంజాయి కోసము అరకు వెళ్లి అక్కడ లంబసింగి వాటర్ ఫాల్స్ దాటిన తరువాత అన్నారము వద్ద ఛత్రపతి, కొండలరావు అనువారి వద్ద నుండి లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేసి గుంటూరు తీసుకొని వచ్చి, అందులో అతను కొంత లిక్విడ్ గంజాయి త్రాగుతూ, కొంత అమ్ముకునే వాడు, ఈ క్రమము లో సుమారు 4 రోజుల తన వద్ద లిక్విడ్ గంజాయి అయి పోయి నందువలన ఛత్రపతి, కొండలరావు లకి ఫోన్ చేయగా వాళ్ళు రెండురోజుల తరువాత ఫోన్ చేయమనగా నేను ది. 14.03.2026 వ తేదిన లిక్విడ్ గంజాయి కావాలని ఫోన్ చేయగా వాళ్ళు ఈరోజున అనగా ది 15.03.2026 వ తేదిన గంటలకు గుంటూరు వచ్చి అతను చెప్పినట్లు వస్త్రనగర్ లోపల ఖాళీ ప్రదేశమువద్దకు వచ్చి ఉండగా పోలీస్ వారు వచ్చి లిక్విడ్ గంజాయి ని స్వాదీన పరచుకొని, నిందితులని అరెస్ట్ చేయడం జరిగింది.ల ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఈస్ట్ స్ డిఎస్పి అయిన అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ... గుంటూరు జిల్లా ఈస్ట్ సబ్ డివిజన్ లో గంజాయి మహమ్మారిని కూకటివేళ్ళతో పెకలించి, నిర్మూలించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి, ఈగల్ టీం వారితో సమన్వయం చేసుకుంటూ గంజాయి విక్రయం, వినియోగం మరియు సరఫరా చేసే వారిని కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి కేసుల్లోని పాత నేరస్తులపై నిఘా పెట్టి, వారి కదలికలు, వారు చేసే పనులు, వారి జీవన విధానం, వ్యవహార శైలి వంటివి పరిశీలిస్తూ ఎక్కడైనా ఏవైనా అనుమానాస్పద విషయాలు వారిలో కనిపిస్తే వెంటనే వారిని అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాము. తరచుగా గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం మరియు నూతన పిట్ ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కూడా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. పై కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన గుంటూరు ఈస్ట్ డి.ఎస్పి అబ్దుల్ అజీజ్ ని, పాత గుంటూరు సిఐ వెంకట ప్రసాద్ ని మరియు సిబ్బంది మోహన్, నూరుద్దీన్, రామరావు ను గుంటూరు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్, అభినందించినారు. గుంటూరు ఈస్ట్ డి.ఎస్పి అబ్దుల్ అజీజ్ ని, పాత గుంటూరు సిఐ వెంకట ప్రసాద్ ని మరియు సిబ్బంది మోహన్, నూరుద్దీన్, రామరావు ను గుంటూరు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్, అభినందించినారు.

# పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణకు గుంటూరు నుంచి కదిలిన ఎన్డీయే కూటమి నేతలు....







పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. అమరావతి తుళ్లూరు పెద్దపరిమి రోడ్‌లోని శాఖమూరు పార్క్‌లో నిర్వహించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి నేతలు,కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు పాల్గొనేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మార్కెట్ సిగ్నల్స్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి ఈ బస్సులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఆయన జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, పరిశీలకులు సింహాద్రి కనకాచారి మరియు పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించడం గర్వకారణమని అన్నారు. ఇది కేవలం ఒక మహనీయుడి పుట్టినరోజు మాత్రమే కాకుండా, ప్రతి తెలుగు వాడు గుర్తుంచుకోవాల్సిన పర్వదినమని పేర్కొన్నారు. మెద్రాస్ ప్రెసిడెన్సీ కాలంలో తెలుగువారు ఎదుర్కొన్న అవమానాలకు ఎదురు నిలిచి, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడటానికి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కావాలని సంకల్పంతో పొట్టి శ్రీరాములు గారు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం చరిత్రలో చిరస్మరణీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. తెలుగు ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం భారతదేశ చరిత్రలో ఒక మహత్తర ఘట్టంగా నిలిచిందన్నారు. పిల్లల కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలు మనకు తెలుసని, కానీ దేశం కోసం, రాష్ట్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి ప్రభుత్వ నాయకులు ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. 58 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ విగ్రహం, పొట్టి శ్రీరాములు గారు చేసిన 58 రోజుల నిరాహార దీక్షకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో, 26 టన్నుల కాంస్యం మరియు 42 టన్నుల ఇనుముతో ఈ విగ్రహాన్ని నిర్మించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ విగ్రహాన్ని "స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్" పేరుతో ఆవిష్కరించడం శుభపరిణామమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రజల తరఫునప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,దేశంకోసంత్యాగం చేసిన మహనీయులను భావితరాలకు పరిచయం చేసే ఈ ప్రయత్నం అభినందనీయమని అన్నారు.

# విద్యా వ్యవస్థలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణ మెలగాలని, అప్పుడే అభివృద్ధి మొదలవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి16: విద్యారంగం, గ్రామ వార్డు సచివాలయాల పనితీరుపై జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, ఎండిఓలతో వీక్షణ సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిర్వహించారు ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో నూరు శాతం విద్యార్థుల హాజరు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 1,415 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయన్నారు. అందులో 5,041 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా 90శాతం హాజరు ఉండడంపై ఆరా తీశారు. ఒక లక్ష 30 వేల 983 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థుల హాజరు 89శాతం ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. హాజరు శాతం తక్కువగా ఉండడంపై సంబంధిత ఎంఈఓలను ఆయన నిలదీశారు. విద్యార్థుల బయోమెట్రిక్ నవీకరణ ప్రక్రియ జాప్యంపై ప్రశ్నించారు. చిన్నగంజాం మండలంలో గడిచిన మూడు నెలలుగా పని తీరు బాగోలేదనిపద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు విద్యాశాఖ అధికారులు విధిగా సమయపాలన పాటించాలి, తప్పనిసరిగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. గైర్హాజర్ నివారించాలని పలు సూచనలు చేశారు సచివాలయాల పరిధిలో చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. 4,600 కుటుంబాల సర్వే నేటికీ పెండింగ్ లో ఉండడంపై నిలదీశారు. మంగళవారం నాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజల ఈ కేవైసీ ప్రక్రియ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. 3,522 ఈకేవైసీ పెండింగ్ తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ అవార్డు సచివాలయాల సిబ్బంది హాజరు నూరు శాతం ఉండాలన్నారు. కర్లపాలెం మండలంలో సిబ్బంది హాజరు తక్కువగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏపీ సేవ నగదు తక్షణమే ప్రభుత్వ ఖజానాకు చేర్చాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు ఈ సమావేశాలు డి ఈ ఓ శ్రీనివాస్ సింగ్, సచివాలయాల ఇంచార్జి విజయలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ పి.యశ్వంత్, ఎండిఓ లు, ఎంఈఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పొట్టి శ్రీరాములు మార్గం తరతరాలకు స్ఫూర్తిదాయకం..జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 16. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు జాతి ఆత్మగౌరవానికి, భాషా-సాంస్కృతిక స్వాభిమానానికి నిలువెత్తు ప్రతీక అని.. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని, ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఇలాంటి గొప్ప వ్యక్తుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. మహనీయుల త్యాగనిరతి, స్ఫూర్తిని భావి తరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అమరావతిలోని శాఖమూరులో పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వర్చువల్ గా హాజరై వీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు....

# సజావుగా పదో తరగతి పరీక్షలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





పెన్ పవర్, విజయవాడ, మార్చి, 16. జిల్లాలో పదో తరగతి తొలిరోజు పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లు ఆహ్లాదకర వాతావరణంలో పరీక్ష రాసేందుకు దోహదం చేశాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గవర్నర్‌పేట సీవీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి తనిఖీ చేశారు. సీటింగ్ అరేంజ్‌మెంట్, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ మొత్తం 27,360 మంది విద్యార్థులకు 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పించామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్‌టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందేలా చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అమలుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఈసారి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. పరీక్షలు సజావుగా జరిగేలా కేంద్రాల వద్ద ప్రత్యేక పర్యవేక్షణతో పాటు అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేసినట్లు డీఈవో చంద్రకళ వెల్లడించారు....

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించిన డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థులు




పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 16: బాపట్లలోని డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మొదటగా డా నివేదిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ తొలిపలుకులతో, అమరజీవి పొట్టి శ్రీరాములు కఠోర దీక్షతో భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు గూర్చి తెలిపారు. కళాశాల ప్రవేశ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన నిస్వార్థ త్యాగాన్ని, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారుఈ సందర్భంగా మూడవ సంవత్సరం విద్యార్థిని టి. రేష్మి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలు మరియు ఆయన మహనీయతను వివరించారు. ఆమె మాట్లాడుతూ ఆయన మహాత్మా గాంధీ ఆలోచనలను అనుసరించి సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన 58 రోజుల నిరాహార దీక్ష భారత చరిత్రలో ఒక కీలక ఘట్టమని, అదే ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిందని తెలిపారు. ఆయన త్యాగం సంకల్పం, దేశభక్తి మరియు సమాజ సేవకు ప్రతీకగా నిలిచిందని చెప్పారు. తరువాత కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. సర్దార్ బేగ్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో విశిష్ట స్థానం కలిగి ఉందన్నారు. ఆయన వీరమరణం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటమే కాకుండా దేశంలో భాషాపరంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కూడా మార్గం సుగమమైందని తెలిపారు. విద్యార్థులు ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ మరియు సేవా తత్వాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. అలాగే అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 58 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. "త్యాగ విగ్రహం"గా పేరుపొందిన ఈ విగ్రహం ఆయన చేసిన 58 రోజుల నిరాహార దీక్షను స్మరింపజేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే శాశ్వత స్మారకంగా నిలుస్తుందని తెలిపారు.

# న్యాయం కోరుతూ .... భర్త ఇంటి ముందు భార్య నిరసన

తాడేపల్లి రూరల్ (గుంటూరు) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 16: ' న్యాయం చేయాలి ' అంటూ ... భర్త ఇంటిముందు భార్య నిరసనకు దిగిన ఘటన ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి ఎస్ వి అపార్ట్మెంట్ లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో బాధితురాలు చైతన్య మాట్లాడుతూ .... కృష్ణా జిల్లా, పామర్రుకు చెందిన చైతన్య అనే యువతికి, గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, మందడంకు చెందిన ఎర్రంనేని విజయ్ కి 2017లో పెద్దల సమక్షంలో వివాహమైంది. పెళ్లయిన తరువాత చైతన్యకు ప్రెగెన్సీ వచ్చినప్పటి నుండి ఆమె భర్త విజయ్ భార్యను పట్టించుకోకుండా పట్టీపట్టనట్టుగా వ్యవహరించాడు. తనకి ఇష్టం లేని పెళ్లి చేశారంటూ పెళ్లి అయిన ఎనిమిది నెలలకే భార్య చైతన్యను వదిలేశాడని, అప్పటినుండి పుట్టింటికి వచ్చేసిన చైతన్య 2019 బాబుకు జన్మనిచ్చిన తర్వాత భర్త, అత్తమామలు బాబును చూడటానికి వచ్చారే కానీ, తనను కాపురానికి తీసుకు వెళ్లలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

# 10 వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 16: జిల్లాలో 10 వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారుఈ నెల 16 నుండి ఏప్రిల్ 1 వరకు జిల్లాలో 10 వ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా సోమవారం పట్టణంలోని అన్నవరపు వారి ఉన్నత పాఠశాల లో జరుగుతున్న 10 వ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు జిల్లాలో 10 వ తరగతి పరీక్షలలోఅవకతవకలు,ఇబ్బందులు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల కేంద్రాల వద్ద తాగునీరు, ఓ ఆర్ ఎస్,ప్యాకెట్లు,ఏర్పాట్లు చేయాలని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని హెచ్ యం ని ఆదేశించారు పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# తమ సమస్యలను విన్నవించుకున్న 59 మంది అర్జీదారులు

**అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కరించాలి జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 16 అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వరకట్న వేధింపులు, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు తదితర పలు సమస్యలతో మొత్తం 59 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని, వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చట్ట పరిధిలో విచారించి సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఎస్.ఐ లక్ష్మీరాజ్యం ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ లో అందే ఆర్జీలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు...నగర కమిషనర్ కె.మయూర్ అశోక్...







పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం ఉన్నందున కమిషనర్ ఆదేశాల మేరకు మేనేజర్, డిఈఈలు, ఏసిపీలు పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అర్జీలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ప్రజలు ఇస్తున్న అర్జీల పరిష్కారంకు విభాగాధిపతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని, జీరో బియాండ్ ఎస్ఎల్ఏ నిర్వహించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 37 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 7, ఇంజినీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 10, ప్రజారోగ్య విభాగం 2, ఉపా సెల్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బాలాజీ బాష, ఏసిపీ రెహ్మాన్, డిఈఈ రమేష్ బాబు విభాగ సూపరిండెంట్ లు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు కి ఘనమైన నివాళి... బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా హిందూ కాలేజ్ దగ్గర వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను త్యాగం చేయడం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన సంఘటన అని అన్నారు. తెలుగు ప్రజల స్వాభిమానం కోసం ఆయన చేసిన త్యాగం ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఏర్పడిందని వారు గుర్తు చేశారు. ఆయన త్యాగస్ఫూర్తి తరువాత భాషాపరమైన రాష్ట్రాల ఏర్పాటుకు కూడా మార్గం సుగమం అయ్యిందని తెలిపారు. ఈ నాటి యువత పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన అమరావతి రాజధానిలో 58 అడుగుల వారి విగ్రహాన్ని పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభోత్సవం చేయడం మంచి నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లడం హర్షణీయమని అన్నారు. ఇటువంటి మహనీయుల జీవితాలని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చరక కుమార్ గౌడ్, దేసు, సత్యనారాయణ, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, దానబోయిన శివయ్య, రావూరి , అప్పిశెట్టి రంగా రావు, పార్థసారధి,మండల అధ్యక్షులు మల్లాల లక్ష్మణ్ గౌడ్, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ నైతికత దమ్ము -- వైసీపీ ద్వంద్వ వైఖరి... రాచకొండ లక్ష్మయ్య...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంపీలైనా ఎమ్మెల్యేలైనా పార్టీ నాయకులైన కార్యకర్తలైన ఎవరైనా సరే ఒక ఆరోపణ రాగానే, విచారణ కూడా పూర్తికాకముందే ఎంపీ పుట్టా మహేష్‌ను పార్టీకి దూరం పెట్టి తెలుగుదేశం పార్టీ తన నైతికతను చాటుకుంది. తప్పు చేస్తే ఎవరినీ వదిలేది లేదని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది.కానీ వైసిపి పార్టీ నేరగాళ్లను నెత్తిన పెట్టుకుని ఊరేగే ఈ వైసీపీకి నీతులు చెప్పే అర్హత ఉందా? ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేసి డెడ్ బాడీని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన కూర్చోబెట్టుకుంది ఎవరు? న్యూడ్ కాల్’ వివాదంలో దేశం ఛీకొట్టినా, ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సస్పెండ్ చేయకుండా వెనకేసుకొచ్చింది, ఎవరు విశాఖలో డ్రగ్స్ ( ఎల్ ఎస్ డి ) అమ్ముతూ దొరికిన వైసీపీ విద్యార్థి నేత కొండారెడ్డిపై ఈ వైసిపి పార్టీ ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తప్పు చేస్తే సొంత పార్టీ వారినైనా శిక్షించే దమ్ము ధైర్యం మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది. కాని జగన్మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తులు హంతకులను, నేరస్థులను కాపాడే సంస్కృతి వైసీపీది. డ్రగ్స్ మాఫియా నడుపుతున్న మీ సొంత నేతలను వదిలేసి, సాక్షి పేపర్ సాక్షి మీడియా నీతులు చెబుతుంటే జనం నవ్వుకుంటున్నారని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

# అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు: ఎమ్మెల్యే ఆనందబాబు



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 16: భాషా ప్రయోక్త రాష్ట్రాలకు అలుపెరగని పోరాటం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని మాజీ మంత్రి వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు.పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని మండల కార్యాలయాల ఆవరణలోనున్న అమరజీవి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనందబాబు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంగా తమిళనాడులో కలిసి ఉన్న తెలుగువారి కొరకు భాషా ప్రయోక్త రాష్ట్రానికి తన జీవితాన్నే ఫణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు.58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అసువులు బాసిన పుణ్యమూర్తి శ్రీరాములని అన్నారు. నేడు మనందరం తెలుగువారమని, తెలుగు రాష్ట్రం మాది అని గుర్తించే కీర్తిని,ఆ గౌరవం మనందరికీ ఇచ్చింది అమరజీవి అని ఆనందబాబు తెలిపారు.ఒక మనిషి త్యాగం,ఒక జాతి గౌరవం,ఒక దీక్ష,ఒక రాష్ట్రం అమరజీవి చిరంజీవి మరణం లేని గొప్ప శక్తి త్యాగానికి మానవ రూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే కొనియాడారు.నేను ఆంధ్రప్రదేశ్ పౌరుడిని గర్వంగా చెప్పుకుంటున్నామని మనందరికీ ఆ గౌరవాన్ని ఇచ్చింది పొట్టి శ్రీరాములని ఎమ్మెల్యే అన్నారు.ఆ మహానీయుని జయంతి,మన ఆంధ్రులకు పండుగ. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు మంత్రులు పాల్గొన్న సన్నివేశాలను స్థానిక సభ సందర్భంగా స్క్రీన్ పై తిలకించారు. సభలో జిల్లా పంచాయతీ అధికారి కే ఎల్ ప్రభాకరరావు, తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, డిప్యూటీ తహసిల్దార్ అనగాని శాంత లక్ష్మి, వాసవి క్లబ్ అధ్యక్షులు తూనుగుంట్ల నాగభూషణం, ఆర్యవైశ్య యువజన సంఘాల టౌన్ అధ్యక్షులు నాగ రమేష్,తమ్మన రమేష్ బాబు,మద్దుల నారాయణ,మాజేటి వెంకటేశ్వరరావు, కొత్త మాసు శ్రీనివాస ప్రసాద్ గుప్తా,బొలిశెట్టి శ్రీనివాసరావు పలువురు అధికారులు, ఆర్యవైశ్య ప్రతినిధులు ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను బాపట్ల జిల్లా కలెక్టరేట్ న్యూ వీసీ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో పాటు జిల్లా అధికారులు, ఆర్య వైశ్య సంఘాల నాయకులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ ఆశయాలను అనుసరిస్తూ సామాజిక సమానత్వం, దళితుల హక్కులు, సమాజ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు. భాషా ప్రాతిపదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని “త్యాగానికి ప్రతీక”గా ఆవిష్కరించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆయన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు.తాను గతంలో నెల్లూరు జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినప్పుడు పొట్టి శ్రీరాములు సేవలను మరింతగా తెలుసుకోవడానికి ఆయన నివసించిన ఇంటిని సందర్శించినట్టు కలెక్టర్ వివరించారు.బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, అంటరానితన నిర్మూలన కోసం దళితుల ఆలయ ప్రవేశానికి ఆయన చేసిన కృషి గొప్పదని అన్నారు. ఆయన త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, నేటి యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి. గ్లోరియా, బీసీ సంక్షేమ శాఖ డీడీ శివ నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అబ్బులు, కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు, ఆర్య వైశ్య సంఘాల నాయకులు, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అమరావతిలో జరిగిన పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి16: పి జి ఆర్ ఎస్ లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. తన పరిధిలో ఉన్న వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్ని పరిశీలన మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులకు పురమయించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు రైతన్న మీకోసం కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. ప్రారంభ సూచికగా వ్యవసాయ శాఖ రూపొందించిన కరపత్రాలు, గోడపత్రాలను ఆమె విడుదల చేశారు. 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 17, 18, 23, 24, 25 తేదీన ముగుస్తోందన్నారు. ఆరు రోజులపాటు గ్రామాలలో నిర్వహించే ఈ కార్యక్రమాలు రైతన్నలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు,

పెట్టుబడులు–పరిశ్రమలు, సంక్షేమ నుంచి సంపాద సృష్టించే దిశగా రైతులు అడుగులు వేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పించడం, చైతన్య పరచడం కొరకు ఈ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎనిమిది మందితో బృందాలను నియమించాలన్నారు. ప్రతిరోజు ప్రతి బృందం 30 గృహాలను లక్ష్యంగా నిర్దేశించుకుని సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రైతు సేవ కేంద్రాల స్థాయిలో ఈ కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. ప్రతిరోజు జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా పర్యవేక్షించాలని ఆమె సూచించారు. అనంతరం జాతీయ పశు వ్యాధి నియంత్రణ టీకాలు ఈరోజు నుండి ఏప్రిల్ 29వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపండి...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...





పెన్ పవర్, విజయవాడ, మార్చి, 16. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 88 అర్జీలు వచ్చాయి. వీటిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 18, రెవెన్యూకు 14, పంచాయతీరాజ్‌కు 12, పోలీసు శాఖకు 12 అర్జీలు వచ్చాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, డీఆర్‌డీఏ, సాంకేతిక విద్యకు మూడు చొప్పున, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మైన్స్, నైపుణ్యాభివృద్ధికి రెండు చొప్పున అర్జీలు రాగా.. ప్రజా రవాణా, విద్యుత్, బ్యాంకింగ్, బీసీ సంక్షేమం, సహకార, ఎక్సైజ్, దేవాదాయ, గృహ నిర్మాణం, పరిశ్రమలు, ఇరిగేషన్, మార్కెటింగ్, సాంఘిక సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ప్రాధాన్యతతో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అమలుచేస్తోందని.. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయంతో అర్జీల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు...

# పసుమర్రులో ‘రైతన్న మీకోసం’ కార్యక్రమం ...రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 16 : చిలకలూరిపేట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షణలో చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో ‘రైతన్న మీకోసం’ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని, అందులో భాగంగానే ఉగాది పండుగ వేళ రైతుల ఇళ్లలో వెలుగులు నింపేందుకు ‘అన్నదాత సుఖీభవ’ పథకాన్ని అమలు చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. పి.ఎం. కిసాన్ సమ్మాన్ నిధి మరియు అన్నదాత సుఖీభవ ద్వారా అందుతున్న పెట్టుబడి సాయం గురించి కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అనుసరిస్తున్న సాగునీటి వనరుల పరిరక్షణ, కల్పన. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించడం.వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం.ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం.రైతులకు నేరుగా పెట్టుబడి సాయం అందించి ఆదుకోవడం.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరు సదాశివరావు, తెలుగు రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, సొసైటీ ప్రెసిడెంట్ కోడె హనుమంతరావు, క్లస్టర్ ఇంచార్జ్ గంజి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొడవలి శ్రీనివాసరావు, రమాదేవి, మాణిక్యరావుతో పాటు వ్యవసాయ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# చందోలు గ్రామం లోబాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

## పండగ పూట పస్తులు లేకుండా ప్రతి ఒక్కరికి తోఫా పంపిణీ





పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 16: తన రాజకీయ గురువు, బాపట్ల శాసన సభ్యుడు వేగిసిన నరేంద్ర వర్మ రాజు అడుగుజాడల్లో నిజామ్ సేవలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గాబాపట్ల శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షిబ్లీ, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొనటం ఒక శుభపరిణామం మత సామరస్యానికి ప్రతీకగా, పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పిట్టలవాని పాలెంమండల చందోలు గ్రామంలో బాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదర సోదరీమణులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.అలీ ఎడ్యుకేషన్ సొసైటీ పేరు మీద సుమారుగా2000 మందికి తోఫా అందించారు.5000కు పైగా ఇఫ్తార్ విందు పెట్టారు. ఈ విధంగా సేవ చేయటం తో సేవ చేయటం లో సాటి లేరు నీకెవ్వరు అని ప్రజల్లో భావన తీసుకువచ్చారు.గత కొన్ని సంవత్సరాలుగా బాపట్ల నియోజకవర్గ స్థాయిలో నిజామ్ చేస్తున్నచేస్తున్న సేవలు అజరామరం అనేది ప్రతి ఒక్కరి భావన. రాజకీయాలకు,కులమతాలకు అతీతంగా, కేవలం సేవే పరమావధిగా నిజామ్ ముందుకు సాగుతున్నారు. ప్రతి ఏటా రంజాన్ మాసంలో నియోజకవర్గ స్థాయిలో అభిమానులకు, ప్రజలకు ఇఫ్తార్ విందులను నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఇలా చేయటం ఒక విశిష్ట సేవగా నిజామ్ ను అభివర్ణిశీచవచ్చు.దీనికి నిదర్శనమే తన రాజకీయ గురువు అయిన బాపట్ల శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు చేసే సేవా కార్యక్రమాలు. ఈ సందర్భంగా ఉ ర్దూ అకాడమీ చైర్మన్మహమ్మద్ ఫరూక్ షిబ్లీ మాట్లాడుతూ "రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనం అన్నారు. ప్రతి ఒక్క ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ అల్లాను ప్రార్థిస్తున్నానుఅన్నారు. కులమతాలకు అతీతంగా అందరం కలిసిమెలిసి ఉండటమే ఇలాంటి కార్యక్రమంకు ప్రధాన లక్ష్యం అని పేర్కొంటూ అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.నిజామ్ లాంటి యువ నాయకులు ఇలా సేవ చేయటం ఆయన అభ్యున్నతికి తరఖానామ్ అన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి అని కోరుకుంటున్నాను అన్నారు. ఇలాంటి యువ నాయకులు తోడ్పాటు తో అనేక కార్యక్రమాలు చేయొచ్చు అని కితాబు ఇచ్చారు. మరో అతిధి రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ నిజామ్ చేసే సేవను వర్ణించటం నాకు దక్కిన అదృష్టం అన్నారు. ఇలాంటి కుటుంబ సభ్యులను కలువుకునివెళ్ళటం ఒక శుభపరిణామం అన్నారు. ప్రతి ఒక్కరు నా కుటుంబం అనే విధంగా నిజామ్ సేవలు అభినందనీయం అన్నారు. ఈయన చేసే సేవ ఆయనకు భవిష్యత్ ప్రణాళిక చూపిస్తుంది అన్నారు.అధికార గర్వం దరిచేరనీయకుండా, ఒక సామాన్య సేవకుడిలా స్వయంగా భోజనాలను వడ్డిస్తూ, ప్రతి ముస్లిం సోదరుడిని ఆత్మీయంగా పలకరించిన తీరు ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేసింది అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకు సాంబిరెడ్డి,బాపట్లపార్లమెంట్అధికార ప్రతినిధి సొపటి గ్లోరి యానెట్,మాజీ ఎంపీటీసీ కర్లపాలెం మండల కార్యదర్శి బాజి,బాపట్ల పార్లమెంట్ఉపాధ్యక్షుడుమద్దాల ముసలయ్య,కర్లపాలెం క్లస్టర్ ఇంచార్జి నక్కల వెంకట స్వామి,నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త నామన శివన్నారాయన,బాపట్ల మండల టీడీపీ అధ్యక్షుడు ముక్కాముల శివ, టీడీపీ మండల అధ్యక్షుడు అఫ్జల్ ,నాయకులు సాంబరాజు, వెంకటపతి రాజు,నియాజి, ఖాసీం, మీరా, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా విభాగం తెనాలి పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి....






పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. తెనాలి పోస్ట్ రోడ్ లో గల పొట్టి శ్రీరాములు విగ్రహమునకు పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవం నిర్వహించారు అలాగే పొట్టి శ్రీరాములు తెలుగు రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాశారు ఆయన త్యాగనిరతికి గుర్తగా అమరావతిలో 6.8 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 58 అడుగుల స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కోటలక్ష్మీ కుమారి తెనాలి పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం కార్యదర్శి శ్రీమతి శారద గారు మరియు వాసవి క్లబ్, తెనాలి టౌన్ ఇస్కాన్ వాసవి క్లబ్ వనిత తిరుమల సాయి వాసవి క్లబ్ తెనాలి హనుమాన్ రూరల్ వాసవి క్లబ్ గంగా రూరల్ సభ్యులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ భాస్కరుని శివ వెంకట రామ బ్రహ్మం ప్రసాదు సహకారంతో అన్నదానం నిర్వహించారు

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మార్చి 18వ తేది గుంటూరు పట్టణ పర్యటన ప్రతిపాదన ఉండటం పట్ల జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా , పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ సోమవారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ శ్రీ కన్వెన్షన్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయుటకు యోచిస్తున్నారు. అక్కడి నుండి ఆర్ టీ సీ బస్ స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించే పక్షంలో అందుకు తగిన అవకాశాలు పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆర్ టీ సీ బస్ స్టాండ్ వరకు పర్యటించే అవకాశాలు ఉన్నందున వాటి ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద జరిగే కార్యక్రమాల వివరాలు షెడ్యూల్ ఉన్నత అధికారులతో సంప్రదించి తయారు చేయాలని ఆర్.ఎం కు , అధికారులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కే. శ్రీనివాస రావు , ఆర్టీసీ ఆర్ ఎం సామ్రాజ్యం, ట్రాఫిక్ డీఎస్పీ బి శ్రీనివాస్, ఈస్ట్ డీఎస్పీ అజీజ్ , పాత గుంటూరు సి ఐ వెంకట రావు, లాలాపేట సిఐ శివరామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డీ ఎస్పీ శ్రీనివాస రావు, డీటీసి సీతారామిరెడ్డి, గుంటూరు ఈస్ట్ తహసీల్దార్ సుభాని , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన ఐదేళ్ల మున్సిపల్ ప్రయాణం

## చిలకలూరిపేట కౌన్సిల్ హాలులో భావోద్వేగ క్షణాలు







చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 16 : చిలకలూరిపేట : అది కేవలం ఒక మున్సిపల్ సమావేశం కాదు.. ఐదేళ్ల పాటు సాగిన ఒక సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలికిన సందర్భం. నిన్నటి వరకు ప్రజా సమస్యలపై గళమెత్తి, విమర్శలు–ప్రతివిమర్శలతో హోరెత్తిన ఆ హాలు.. సోమవారం మాత్రం ఉద్వేగపూరిత వాతావరణానికి వేదికైంది. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన ఈ అత్యవసర సమావేశం సభ్యుల గుండె బరువును ప్రతిబింబించింది.

రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ ఆలింగనం

మార్చి 17తో కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. సరిగ్గా ఒక రోజు ముందు జరిగిన చివరి సమావేశం కావడంతో, రేపటి నుంచి తామంతా ఒక్క చోట కలిసే అవకాశం ఉండదన్న సత్యాన్ని తలుచుకుని సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకుల గొప్పతనం గురించి అప్పటిదాకా వాదించుకున్న సభ్యులు.. చివరకు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.

కన్నీటి పర్యంతమైన మహిళా కౌన్సిలర్

ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు, సహకరించిన తోటి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ టీడీపీ మహిళా కౌన్సిలర్ కూనల కన్నీటి పర్యంతమయ్యారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల గుండెల్లో తమకు దక్కిన స్థానం మరువలేనిదని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు

తప్పులుంటే క్షమించండి

వైస్ చైర్మన్ ప్రజల సమస్యలు ప్రస్తావించే క్రమంలో అధికారుల పట్ల లేదా తోటి కౌన్సిలర్ల పట్ల తాను దురుసుగా ప్రవర్తించి ఉన్నా, మాటలు తూలి ఉన్నా పెద్ద మనసుతో క్షమించాలని వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర్లు కోరారు. ఐదేళ్ల పాలనలో తనకు సహకరించిన చైర్మన్ షేక్ రఫానికి, అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పథంలో మున్సిపాలిటీ: చైర్మన్ రఫాని

గత ఐదు సంవత్సరాలుగా అందరూ కలిసికట్టుగా నిలిచి ప్రజా సమస్యలపై చర్చించారని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. తమ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మున్సిపాలిటీని 'సెలెక్షన్' గ్రేడ్‌గా మార్చగలిగామని చెప్పారు. త్యాగధనులు డాక్టర్ జాన్ డేవిడ్ పేరును ఒక రోడ్డుకు నామకరణం చేసి సముచిత స్థానం కల్పించామని, నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

అధికారుల అనుభవాల వేదిక

కేవలం కౌన్సిలర్లే కాకుండా, వారితో కలిసి పనిచేసిన మున్సిపల్ అధికారులు సైతం ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం తమ అనుభవాలను పంచుకుంటూ కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మరికొందరు సభ్యులు కుక్కల నివారణ, తాగునీటి సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఘనంగా నివాళులు

సమావేశం ప్రారంభంలో ఇటీవల మృతి చెందిన ఏఎంజీ వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్ డేవిడ్ కుమార్తె పెర్సీ స్వరూప మృతి పట్ల సభ సంతాపం ప్రకటించింది. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కౌన్సిల్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# 34 ఏళ్లుగా పేదలకు రంజాన్ తోఫా... చిన్న సత్తార్ కుమారుల సేవా కార్యక్రమాలకు ప్రశంసలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 16 : చిలకలూరిపేట : తండ్రి పఠాన్ చిన్న సత్తార్ జ్ఞాపకార్థంగా గత 34 ఏళ్లుగా పేదలకు రంజాన్ తోఫా అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన కుమారుల కృషి అభినందనీయమని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ చిన్న సత్తార్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు సుభాని, యూసుఫ్, యాసిన్ ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. తమకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని పేదలకు పంచాలని భావించి గత 34 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సంవత్సరం సుమారు రూ.12 లక్షలు వెచ్చించి 1750 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేస్తున్నారని పేర్కొన్నారు. పండుగ రోజున పేద కుటుంబాలు సంతోషంగా గడపాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, పేదరికం కారణంగా చదువు కొనసాగించలేని విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న వారికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్యుల రామకృష్ణ, పఠాన్ నజీర్ ఖాన్, షేక్ జానీ, షఫీ, అరిటికట్ల రవికిరణ్, కొంగర రవి, దిలీప్, రియాజ్, సాదిక్, అరలయ్య, రఫీక్, ముఫ్తీ అనస్, షేక్ నజీర్ అహ్మద్, వెన్నం కాంతారావు, పఠాన్ రెహమాన్, బోసు, ఏసు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ సజావుగా సాగేలా విస్తృత తనిఖీలు... ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ...





పెన్ పవర్, విజయవాడ, మార్చి, 16. జిల్లాలో వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని.. విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. సోమవారం జేసీ ఇలక్కియ అధికారులతో కలిసి విజయవాడ వన్ టౌన్ సుమన్ గ్యాస్ ఏజెన్సీ, గుణదలలోని అహ్మద్ గ్యాస్ ఏజెన్సీ, నున్నలోని మారుతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్లైన్ డేటాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు అవసరం మేరకు ఉన్నాయని, సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గ్యాస్ కొరతపై ఎలాంటి అపోహలకు లోనుకావద్దని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారులకు నిర్దేశ సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకోసం 9154970454 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూం అందుబాటులో ఉంచినట్లు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ చెప్పారు....

# చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 16 : చిలకలూరిపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్లు గోల్డ్ శ్రీను, వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. వారు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన త్యాగం తెలుగు ప్రజలకు చిరస్మరణీయమని కొనియాడారు.

# పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 16. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా భారీ విగ్రహావిష్కరణ. విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా వివిధ మంత్రులు, ప్రజా ప్రతినిధులు. అమరజీవి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్ తదితరులు. అమరావతిలో తొలి భారీ శిల్పంగా పొట్టి శ్రీరాములు విగ్రహం. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు. శాఖమూరు పార్కులోని 6.80 ఎకరాల్లో అమరజీవి కాంస్య విగ్రహం. అమరజీవి–త్యాగ శిల్పం (స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్) పేరుతో 58 అడుగుల పొట్టి శ్రీరాముల విగ్రహం ఏర్పాటు. 6 నెలల రికార్డు కాలంలోనే ప్రాజెక్ట్ మొదటి దశ పనులు పూర్తి. పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ వినియోగం. రెండో దశలో మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్మాణం....

# నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు




నరసరావుపేట పెన్ పవర్ మార్చి16: విదేశాలకు తరలిపోయిన భారతీయ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ వస్తువులను తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వివరాలు కోరిన నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు. సోమవారం నాడు పార్లమెంట్ లో ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ, 2003లో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జెనీవాకు వెళ్లి శ్యామ్ జి కృష్ణ వర్మ అవశేషాలను భారతదేశానికి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా, ఆస్ట్రేలియా దేశాల నుండి సుమారు ఆరు వందలకుపైగా చారిత్రక, సాంస్కృతిక వారసత్వ వస్తువులను తిరిగి భారతదేశానికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రాచీన అమరావతికి చెందిన పురావస్తు సంపద, ఆచార్య నాగార్జున కాలానికి చెందిన బౌద్ధ స్థూపాల అవశేషాలు విదేశాలకు తరలివెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మూసేమ్ వంటి విదేశీ సంగ్రహాలయాలలో ఉన్న మన పురావస్తు సంపదను తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి సభలో ప్రశ్నించారు. దీనికి స్పందించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శేఖావాట్ మాట్లాడుతూ, విదేశీ పాలన కాలంలో మన దేశానికి చెందిన అనేక చారిత్రక, వారసత్వ సంపద విదేశాలకు తరలిపోయిన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రపంచ దేశాల మధ్య ఉన్న అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం పదిహేడవ శతాబ్దానికి ముందు ఒక దేశానికి చెందిన పురావస్తు సంపద మరొక దేశంలో ఉంటే తిరిగి స్వదేశానికి అందించాలనే నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల భారతదేశం--అమెరికా దేశాల మధ్య కుదిరిన సాంస్కృతిక ఆస్తులు, పురావస్తు సంపద తిరిగి అప్పగింపు ఒప్పందం బలంగా అమలులో ఉందని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా విదేశాల్లో ఉన్న భారతీయ పురావస్తు సంపదను తిరిగి దేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఆచార్య నాగార్జునుడు స్థాపించిన బౌద్ధ స్థూపాలకు సంబంధించిన అనేక పురావస్తు వస్తువులు లండన్‌లోని విక్టోరియా సంగ్రహాలయంలో ఉన్నాయని, వాటిని తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు కి కాపు సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సన్మానం

## కూటమి ఐక్యత, అభివృద్ధి మరియు ప్రజా సేవయే నా ధ్యేయం - ఎమ్మెల్యే అరవింద బాబు







నరసరావుపేట పెన్ పవర్ మార్చి16: స్థానిక సాయి గ్రాండ్ హోటల్ వేదికగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కి సోమవారం నాడు కాపు సంఘం నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల పాత్రలో అద్భుత నటన ప్రదర్శించి, రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు అందుకున్నందుకు గాను ఈ గౌరవ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు భావోద్వేగంతో ప్రసంగిస్తూ తన రాజకీయ, వ్యక్తిగత మరియు సేవా ప్రస్థానాన్ని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కూటమి విజయం చారిత్రాత్మకం నారా చంద్రబాబు నాయుడు కృషి, పవన్ కళ్యాణ్ పట్టుదల, మరియు నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఏర్పడిన ఈ ఉమ్మడి కూటమి విజయం చారిత్రాత్మకమని కొనియాడారు. టీడీపీ, జనసేన పార్టీలు తనకు రెండు కళ్ళ వంటివని, కూటమి ధర్మాన్ని కాపాడుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని అయన స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీ ప్రాణం గత ఐదేళ్లలో అక్రమ కేసులకు భయపడకుండా, కష్టకాలంలో పోరాడిన ప్రతి కార్యకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా కాసా ఆంజనేయ బాబు వంటి నాయకులకు తగిన గుర్తింపు ఇస్తామని, ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం లభిస్తుందని భరోసా ఇచ్చారు. శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తి రాయలవారి పాలనా దక్షత మనందరికీ ఆదర్శమని, ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకు సాగుతున్నానని తెలిపారు. నాయకుడికి నీతి, నిజాయితీ, ధైర్యం మరియు ఓర్పు అత్యంత అవసరమని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ ఉ సినీ నేపథ్యం 1982 నుండి టీడీపీలో కొనసాగుతున్నానని, విద్యార్థి దశ నుండే ప్రజల కోసం పోరాడటం తనకు అలవాటని గుర్తు చేసుకున్నారు. తన తాత మరియు కుటుంబ సభ్యులు 36 సినిమాలు నిర్మించారని, అన్న ఎన్టీఆర్ తో ఉన్న అనుబంధాన్ని, చిరంజీవి, పవన్ కళ్యాణ్ తమ ఇంట్లోనే ఉండేవారని వారి మధ్య ఉన్న ఆత్మీయతను వివరించారు. నిరంతర ప్రజా సేవ చిన్నతనం నుండే ఇతరులకు సహాయం చేయడం తన నైజమని, తన వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికీ మేలు జరగాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. ముఖ్యంగా టీడీపీ కార్యకర్తల కంటే ఎక్కువగా జనసేన నాయకులు, కార్యకర్తల పనులు చేసి పెట్టానని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం ప్రతినిధులు పోతుల శంకర్, రాయల శ్రీనివాసరావు, అల్లం శెట్టి మోహన్, రంగిశెట్టి రామకృష్ణ, తిరుపతిరావు, ప్రసాదు, జనసేన నాయకులు, బిజెపి నాయకులు మరియు ఇతర ముఖ్య నాయకులు, కూటమి కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# గ్యాస్ సిలిండర్ల సరఫరాపై ఆందోళన అవసరం లేదు -- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట పెన్ పవర్ మార్చి16: పల్నాడు జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా సాధారణంగా కొనసాగుతున్నదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో కృత్రిమ కొరత సృష్టించడం లేదా గృహ వినియోగానికి ఉద్దేశించిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గ్యాస్ సరఫరాను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రతి గ్యాస్ సంస్థ వద్ద తహశీల్దార్లను నియమించినట్లు తెలిపారు. వినియోగదారులు సిలిండర్ కొనుగోలు చేసే సమయంలో బిల్లులో పేర్కొన్న ధరనే చెల్లించాలని, అదనపు రుసుము అడిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్యాస్ సరఫరాకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నియంత్రణ గది ఫోన్ నంబరు 08647--252999 కు సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సేవలు ఇరవై నాలుగు గంటల పాటు అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

## కలెక్టరేట్‌లో 125వ జయంతి వేడుకలు, పాల్గొన్న ఎమ్మెల్యే అరవింద బాబు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల









నరసరావుపేట పెన్ పవర్ మార్చి16: తెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప నాయకుడు పొట్టి శ్రీరాములు ని కొనియాడారు. 58 రోజుల పాటు ఆహారపానీయాలు మాని, ఆత్మత్యాగం చేసి ఆంధ్ర రాష్ట్ర సాధనకు బాటలు వేసిన ఆయన త్యాగనిరతిని స్మరించుకున్నారు. రాష్ట్ర చరిత్రలో ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ కృతిక శుక్ల మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం తరపున అమరజీవికి నివాళులు అర్పిస్తూ, ఆయన చూపిన క్రమశిక్షణ, దేశభక్తిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు నాగసారపు సుబ్బరాయ గుప్తా, కాపలవాయి విజయకుమార్, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# ప్రజాసమస్యల పరిష్కార వేదిక

## ప్రజా సమస్యలను వేగంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం -- జిల్లా పోలీసు అధికారి బి. కృష్ణారావు



నరసరావుపేట పెన్ పవర్ మార్చి16: పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి బి. కృష్ణారావు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సమస్యలు, కుటుంబ వివాదాలు, మోసాలు, బెదిరింపులు, ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 88 ఫిర్యాదులను ప్రజలు పోలీసు అధికారులకు అందజేశారు. వాటిని జిల్లా పోలీసు అధికారి పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించారు. ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి చట్టప్రకారం వారికి న్యాయం చేయాలని పోలీసు అధికారులకు జిల్లా పోలీసు అధికారి సూచించారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన ఫిర్యాదులు కూడా అందాయి. నరసరావుపేట పెద్ద చెరువు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి రెండు లక్షల రూపాయలు తీసుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశాడన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే దుర్భాషలాడుతూ దాడి చేసినట్లు పేర్కొంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు. పిడుగురాళ్ల మండలం పెద్ద అగ్రహారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన నీటి ప్లాంట్ కోసం కొనుగోలు చేసిన ఖాళీ సీసాలకు సంబంధించి ముందుగా చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు అందిందన్నారు. సదరు వ్యక్తి తన ప్లాంట్ వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలియజేశాడు. నరసరావుపేట పట్టణంలోని బరంపేటకు చెందిన ఒక యువకుడు విదేశీ ఉద్యోగం పేరుతో ఒక వ్యక్తి రెండు లక్షల నలభై వేల రూపాయలు తీసుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపాడు. మాచర్ల పట్టణానికి చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి తన పదవీ విరమణ అనంతరం పొందిన పదహారు లక్షల రూపాయలను మాయమాటలు చెప్పి ఒక వ్యక్తి తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడని ఫిర్యాదు చేశాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరింపులు చేసి దాడి చేసినట్లు పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరాడు. ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు వచ్చినప్పుడు వాటిని రాయడంలో సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా పోలీసు అధికారి (పరిపాలన) జె.వి. సంతోష్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మెప్మా ఉద్యోగుల బకాయి జీతాలు చెల్లించాలి

విశాఖ. పెన్ పవర్ ప్రతినిధి మార్చి 16: బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎపి మెప్మా ఆర్.పి ఉద్యోగుల సంఘం( సిఐటియు ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి. మణి, అధ్యక్షురాలు ఎస్. లక్ష్మి,కార్యదర్శి సిహెచ్ ఝాన్సీ మీడియాతో మాట్లాడుతూ, ఆర్ పి లకు బకాయి ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలన్నారు. మన డబ్బు– మన లెక్క యాప్ లపై పూర్తి అవగాహన వచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బందికి కేటాయించిన పనిని ఆర్. పి ల తో చేయించడం సరికాదన్నారు. దీనిని రద్దు చేయాలన్నారు. జివిఎంసిలో పనిచేస్తున్న ఆర్ పి లు తీవ్రమైన పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, అనేక పనులు ఒకేసారి చేయిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అదే సమయంలో వేతనాలు చెల్లించకపోవడం శోచనీయం అన్నారు. జివిఎంసిలో 40 మంది లాగిన్స్ వివిధ కారణాలవల్ల ఆపివేశారని, వారికి తిరిగి లాగిన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.